ఘనంగా శ్రీపోలేరమ్మ త్రిశూల ప్రతిష్టాపన

పులివెందుల టౌన్ : పట్టణంలో అతిపురాతణంగా వెలసిన గ్రామ దేవతలు శ్రీఅంకాలమ్మ, శ్రీనడివీధి పెద్దమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు ఆదివారం పెద్ద ఎత్తున మహిళలు బోనాలు సమర్పించారు. శ్రీపోలేరమ్మతల్లి త్రిశూల ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా తెల్లవారుజామునుంచి గ్రామ దేవతలకు భక్తులు బోనాలు, కాయ కర్పూరాలు సమర్పించారు. ఉదయం 9 గంటల నుంచి శ్రీఅంకాలమ్మ ఆలయం వద్ద నుంచి శ్రీపోలేరమ్మ తల్లి ప్రతిమను ప్రత్యేక వాహనంలో ఉంచి అక్కడ నుంచి అమ్మవారిశాల వీధిలోని నడి వీధి పెద్దమ్మ ఆలయం మీదుగా పోలేరమ్మ ఆలయం వరకు మహిళలు బోనాలు తలపై పెట్టుకుని గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం బోనాలు సమర్పించారు. అనంతరం త్రిశూల ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి శ్రీపోలేరమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి పూజారులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు స్థానిక మిస్సమ్మ బంగ్లా అవరణలో మాంసహార, శాకాహారాలకు సంబంధించిన భోజనాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, హిందు బంధువులందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


గ్రామోత్సవంలో అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న మహిళలు

రాంగోపాల్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి

పులివెందుల : పులివెందుల వైద్య కళాశాలపై రాంగోపాల్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలను ఖండిస్తోందని, రాంగోపాల్‌రెడ్డి వెంటనే భారత జాతికి క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, రాష్ట్ర నూర్‌బాషా సంఘం మాజీ చైర్మన్ రసూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫిజుల్లా, కౌన్సిలర్లు రాజశేఖర్‌రెడ్డి, మల్లికార్జున, ఖాదర్‌బాషాలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను వారు సందర్శించి మాట్లాడారు. రాంగోపాల్ రెడ్డికి పులివెందుల వాసిగా ఈ ప్రాంతంపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ప్రైవేటీకరణపై పోరాటం చేయాలన్నారు. మీరు చెప్పినట్లు కేవలం రంగులు వేసిన భవనానికి భారత జాతీయ వైద్య కమిషన్ 50 సీట్లు ఎలా మంజూరు చేసిందన్నారు. వైద్య విద్య విషయంలో భారత జాతీయ వైద్య కమీషన్ కంటే రాంగోపాల్‌రెడ్డికి ఉన్న శాస్త్రీయత ఏమిటి అని ప్రశ్నించారు. రాంగోపాల్‌రెడ్డి వైద్య కళాశాల పూర్తి కాకుంటే వైద్య కళాశాలకు ఎదురుగా తన ఎమ్మెల్సీ నిధులతో బస్టాఫలను ఏర్పాటు చేసి ఫొటోలు ఎందుకు ముద్రించుకున్నావన్నారు. జాతీయ వైద్య కమిషన్‌ను అగౌరవపరిచిన రాంగోపాల్‌రెడ్డి వెంటనే భారత జాతికి క్షమాపణలు చెప్పాలన్నారు. పులివెందుల ప్రజల ఆకాంక్షను నెరవేర్చే మెడికల్ కళాశాలల విషయంలో కళ్లు ఉండి కూడా చూడలేని దుస్థితి కూటమి నేతలకు నెలకొందన్నారు. పేద ప్రజల విద్యార్థుల కోసం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన కళాశాలతో ఎక్కడ జగన్ మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తోందోనని చంద్రబాబుకు నిద్ర పట్టడం లేదన్నారు. ఇకనైనా పీపీపీ విధానానికి స్వస్తి చెప్పి చంద్రబాబు మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని, లేకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజల తరపున పోరాటం చేస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీ నాయకులు చెన్నకేశవులు, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు కొండయ్య, ఈశ్వరయ్య, యువజన నాయకులు జహీర్, ప్రశాంత్, విష్ణు, చిన్న, నజీర్, జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల విష ప్రచారం

జమ్మలమడుగు రూరల్ : మెడికల్ కాలేజీలపై కూటమి నాయకులు చేస్తున్న విష ప్రచారం మానుకోవాలని మున్సిపల్ విభాగ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి పేద విద్యార్థి డాక్టర్ కావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రాష్ట్రంలో 17 నూతన కాలేజీల ఏర్పాటుకు కృషి చేశారన్నారు. అంతే కాకుండా 50 సీట్లు మంజూరు అయ్యాయన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాలేజీలు పూర్తి కాలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రజ్ఞా శిఖరం 'మోక్షగుండం'

- నేడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి
- ఇంజినీర్ల దినోత్సవం


కడపలోని విశ్వేశ్వరయ్య విగ్రహం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆధునిక కాలంలో ఇంజినీరింగ్ వ్యవస్థకు ఎంత గొప్ప ప్రాధాన్యత ఉందో అందరికీ తెలిసిందే. మానవుడికి కనీస అవసరాలైన కూడు, గూడు, వస్త్రాలలో ఒకటైన గూడు (ఇల్లు) నిర్మాణంలో ఇంజినీర్లది ముఖ్యమైన పాత్ర. నివాస గృహాలైనా, కార్యాలయాలు, కర్మాగారాలైనా, చర్చిలు, మసీదులు, ఆలయాలు, చెక్‌డ్యాంలు, భారీ ప్రాజెక్టులు ఇంజినీర్ల ప్రతిభకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. మన దేశానికి చెందిన గొప్ప ఇంజినీరు, సాంకేతిక ప్రజ్ఞాశిఖరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన పుట్టిన రోజు సెప్టెంబరు 15ను ఇంజనీర్ల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాము. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన ఇంజినీర్లకు సాక్షి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తోంది.

'మోక్షగుండం' జీవిత విశేషాలు

మోక్షగుండం విశ్వేశ్వరయ్య సామాన్య కుటుంబంలో పుట్టి స్వయం కృషితో ఉన్నత స్థాయి సాంకేతిక ప్రజ్ఞామూర్తిగా పేరు గడించారు. సివిల్ నిర్మాణాలు, నీటిపారుదల, వరదల నివారణ కోసం ప్రత్యేక నిర్మాణాలు ఇలా ఎన్నో విశిష్టమైన కట్టడాల నిర్మాణంతో ఆయన ఇతర దేశాల సాంకేతిక నిపుణుల ప్రశంసలు పొందారు. 1816లో కర్ణాటకలో కోలార్ జిల్లాలో జన్మించిన మోక్షగుండం పూర్వీకులు ప్రకాశం జిల్లాకు చెందిన వారే. బెంగళూరు, పూణేలలో విద్యాభ్యాసం చేసి సివిల్ ఇంజినీరింగ్‌లో ప్రతిభ చూపారు. ప్రత్యేకించి నీటిపారుదల నిర్మాణాలపై ప్రత్యేక అధ్యయనం చేసిన ఆయన ఆ రంగంలో సమకాలిన ఇంజినీర్ల కంటే ఎంతో ఉన్నత స్థానంలో నిలిచారు. 1908లో మైసూరు మహరాజ ఆయనను తమ రాష్ట్రంలోని రాజ్యసభ చీఫ్ ఇంజినీరుగా నియమించారు. ఆయన మార్గదర్శకత్వంలోనే కావేరి నదిపై కృష్ణరాజ సాగర్‌ను నిర్మించారు. 1912లో మైసూరు దివాన్ అయ్యారు.

మన ప్రాంతంలో..

జిల్లాలో బ్రిటీషు కాలం నాటి ఎన్నో భవనాలు నేటికి పటిష్టంగా నిలిచి ఉండటాన్ని గమనించవచ్చు. ప్రభుత్వ పురుషుల కళాశాల, కలెక్టర్ బంగ్లా, ఎస్పీ కార్యాలయం, బంగ్లా, పాత కలెక్టర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం నేటికి నాటి ఇంజినీర్ల ప్రతిభను చాటుతున్నాయి. జిల్లాలో 100 సంవత్సరాలు దాటినా పటిష్టంగా ఉన్న ఎన్నో చర్చి భవనాలను కూడా గమనించవచ్చు.

మోక్షగుండం ఆదర్శంగా

తమ శాఖలో మేరు సమానులైన మోక్షగుండెం విశ్వేశ్వరయ్యపై గౌరవంతో కడప నగరంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక ఎల్ఐసీ సర్కిల్‌లో ఉన్న ఈ విగ్రహం వద్ద ప్రతి ఏడాది ఇంజనీర్ల దినోత్సవ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నారు. ఆయన పేరిట సమీపంలోనే ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆదివారం ఎర్రగుంట్లలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1993-1994 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు


ఆదివారం కొండాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు

గంగమ్మతల్లికి విశేష పూజలు



చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, నగలు, గంధం, పసుపు, నిమ్మకాయలు, వేపాకులు, ప్రత్యేక పూలమాలలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకొన్నారు. బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి, వైద్యనాథీశ్వర ఆలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా దేవాలయాలలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

హిందీని అనర్గళంగా నేర్చుకోవచ్చు

వేంపల్లె : చిన్నపాటి సూచనలు పాటిస్తే హిందీని అనర్గళంగా నేర్చుకోవచ్చునని పాఠశాల హెడ్మాస్టర్ శివమునెమ్మ తెలిపారు. దివారం వేంపల్లెలోని స్థానిక తలిశెట్టి సుబ్రమణ్యం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ శివమునెమ్మ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.